క్లుప్తంగా

కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేత



వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వడ్లూరి శ్రీనివాస్ గురువారం నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన సందీప్ కుమార్ ఝాను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పాఠశాల ప్రగతిని గురించి చర్చించినట్లు తెలిపారు. కళాశాలలోని అడ్మిషన్లు, వసతుల గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

ఆలయంలో పూజలు



ఎల్లమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న వేణురావు

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండలం కందికట్కూర్‌లోని రేణుకా ఎల్లమ్మ తల్లిని గురువారం మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చింతపల్లి వేణురావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

శుద్ధనీటి యంత్రం వితరణ



ఎల్లారెడ్డిపేట: మండలంలోని సింగారం ప్రాథమిక పాఠశాలలో హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ శుద్ధనీటి యంత్రం గురువారం అందించింది. ఈ సందర్భంగా ఎంపీడీవో సత్తయ్య మాట్లాడుతూ యువకులు స్వచ్ఛంద సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. హెల్పింగ్ హ్యాండ్స్ ఇప్పటికే మండలంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేసిందన్నారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు మిషన్ ను ఏర్పాటు చేశారన్నారు. ఎంపీడీవో, మాజీ సర్పంచ్ నర్సాగౌడ్, సొసైటీ బాధ్యులు గోనే నాగరాజు, దేవరాజు, దేవయ్య, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

కోలుకున్న ప్రతాప రామకృష్ణ

వేములవాడ: అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ హైదరాబాద్‌లోని తన నివాసానికి చేరుకున్నారు. వారం రోజులపాటు విశ్రాంతి అనంతరం వేములవాడకు వస్తారని కుటుంబ సభ్యులు తెలిపారు. పట్టణానికి చెందిన వివిధ రాజకీయ పార్టీల నాయకులు, పుర ప్రముఖులు, బంధువులు, తదితరులు గురువారం పరామర్శించారు.

చెట్లను తొలగించండి



కార్యదర్శికి వినతిపత్రం ఇస్తున్న యువకులు

ఎల్లారెడ్డిపేట: గొల్లపల్లి బస్టాండ్ సమీపంలోని డివైడర్‌పై పెంచిన చెట్లతో ఇరువైపులా వెళ్లే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయని వాటిని వెంటనే తొలగించాలని కోరుతూ గొల్లపల్లికి చెందిన యువకులు గ్రామ పంచాయతీ కార్యదర్శి రామకృష్ణకు వినతిపత్రం అందించారు. కోనోకార్పస్ చెట్ల పుప్పొడితో శ్వాసకోశ వ్యాధులు వస్తున్నాయని, వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అంతేకాకుండా గొల్లపల్లి బస్టాండ్ వద్ద స్టాపర్లు ఏర్పాటు చేయాలని కోరారు. కోనేటి సతీశ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

స్తంభాలు తొలగించకుండానే రోడ్డు విస్తరణ పనులు



తంగళ్లపల్లి: విద్యుత్ శాఖ అధికారులు, రోడ్డు రవాణా శాఖ అధికారుల మధ్య సమన్వయ లోపం బస్వాపూర్ గ్రామంలో కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. గ్రామంలో రోడ్డు విస్తరణ పనులు జరుగుతుండగా.. అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి వేరేచోట ఏర్పాటు చేయకుండా రోడ్డు పనులు చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రోడ్డు వేసిన తర్వాత ఇబ్బందులు లేకుండా రెండు శాఖల అధికారులు సమన్వయంతో రోడ్డు పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

నిఘా నీడలో ఎములాడ..

- అడుగడుగునా సీసీ కెమెరాలు
- ప్రజాప్రతినిధులు, వ్యాపారుల భాగస్వామ్యం
- నేరాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు
- నేరస్తుల గుండెల్లో గుబులు

వేములవాడ : దక్షిణకాశీ, నిత్యం వేలాదిమంది భక్తులు, స్థానికులతో కిటకిటలాడే వేములవాడ పట్టణంలో నిఘాను మరింత తీవ్రతరం చేశారు. అడుగడుగునా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పటిష్ట భద్రత కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకు జిల్లా పోలీసుశాఖ ప్రజాప్రతినిధులు, వ్యాపారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, రాష్ట్ర దేవాదాయశాఖ అధికారుల సహాయ సహకారాలను కోరుతోంది. స్వచ్ఛందంగా ముందుకొచ్చి భద్రతలో భాగస్వామ్యం కావాలంటూ పిలుపునిస్తున్నారు. దీంతో చాలామంది ప్రజాప్రతినిధులు, వ్యాపారులు ముందుకొస్తున్నారు. వేములవాడలో ఒక్కో కౌన్సిలర్ 10 సీసీ కెమెరాలు, వ్యాపారులంతా తమ దుకాణాల ముందు తప్పకుండా సీసీ కెమెరా ఏర్పాటు చేసేలా ముందుకొస్తున్నారు.



పట్టణంలో పలు కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల చిత్రాలు

వేములవాడలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

రాజన్న ఆలయంలో	– 262
పట్టణ ప్రధాన రహదారిలో	– 25
ప్రైవేట్ లాడ్జిలు	– 550
వ్యాపారులు	– 3,500
విద్యా సంస్థలు	– 215
ప్రభుత్వ కార్యాలయాలు	– 25
ఆస్పత్రులు	– 60
గృహ యజమానులు	– 4,100

నేరాల అదుపునకే



ప్రజలకు భద్రత కల్పిస్తూనే నేరాలను అదుపు చేసేందుకు సీసీ కెమెరాలు దోహదపడతాయి. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో నేరాలు, అసాంఘిక కార్యకలాపాలు చాలా తగ్గాయి. ఇటీవల అగ్రహారంలో జరిగిన రోడ్డు ప్రమాదం వాహనాన్ని కనుగొన్నాం. దొంగతనాలు, హత్య కేసులను సీసీ కెమెరాల ద్వారా ఛేదిస్తున్నాం. సీసీ కెమెరాల ఏర్పాటులో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలి.

– అఖిల్ మహాజన్, జిల్లా ఎస్పీ

చాలా రోజుల క్రితమే ఏర్పాటు



దుకాణంలో చాలారోజుల క్రితమే సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. మెయిన్ రోడ్డులో ఉండటంతో పోలీసుల సూచన మేరకు రహదారి కనిపించే విధంగా సీసీ కెమెరా ఏర్పాటు చేశాం. ప్రజల భద్రత కోసం సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయి.

– భరత్, జ్యువెలరీ వ్యాపారి, వేములవాడ

నేరాల నియంత్రణకు దోహదం



నేరాలను నియంత్రణకు సీసీ కెమెరాల ఏర్పాటు ఒకటే మార్గం. సీసీ కెమెరాలతో నిరంతరం నిఘా కొనసాగుతుంది. మా దుకాణంలో సీసీ కెమెరా ఏర్పాటు చేశాం. పోలీసుల సూచన మేరకు రోడ్డు కవర్ చేసేలా మరో సీసీ కెమెరా ఏర్పాటు చేస్తాం. సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ ముందుకురావాలి.

– కృష్ణారెడ్డి, పెయింట్ స్టోర్, వేములవాడ

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కోనరావుపేట: భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు అన్నారు. మండలకేంద్రంలో మాట్లాడుతూ కార్మికులకు జారీచేసే లేబర్ కార్డు విషయంలో వేలిముద్ర తీసుకునే విధానాన్ని రద్దు చేయాలన్నారు. సిమెంట్, ఇతర పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుల వేలిముద్రలు స్కాన్ కావడం లేదని, ఈ కారణంగా వేలిముద్ర ఆప్షన్‌ను తొలగించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న క్లయిమ్స్ వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో బొల్లె బాబు, శ్రీనివాస్, రాజన్న, దేవరాజ్, కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

కోనరావుపేట: కేంద్రం మంత్రివర్గం 14 రకాల పంటలకు మద్దతు ధర పంచేందుకు నిర్ణయం తీసుకోవడాన్ని హర్షిస్తూ బీజేపీ నాయకులు ప్రధానమంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మండలశాఖ అధ్యక్షుడు గొట్టె రామచంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైతులు, నాయకులు పాల్గొని క్షీరాభిషేకం చేశారు. జిల్లా కార్యదర్శి గోపాడి సురేందర్‌రావు, నాయకులు మిర్యాల్‌కార్ బాలాజీ, వెంకటి, మోహన్, సురేశ్, నాగరాజు, పర్శరాములు, తదితరులు పాల్గొన్నారు.

మూలనపడ్డ వైకుంఠ రథం

ముస్తాబాద్: మండలంలో ఎవరైనా మృతిచెందితే అంతిమ సంస్కారాలకు ఉపయోగపడేలా వైకుంఠ రథాన్ని అందజేశారు. మాజీ మంత్రి కేటీఆర్ తన నిధుల నుంచి ముస్తాబాద్ మండలానికి వైకుంఠ రథాన్ని అందించారు. ఎనిమిదేళ్లుగా వైకుంఠ రథం ఎంతోమంది అంత్యక్రియలకు ఉపయోగపడింది. మూడు నెలలుగా అది మూలనపడింది. వాహనం మరమ్మతులకు గురి కావడంతో.. దానిని బాగు చేయించేవారు లేకపోయారు. మండలంలో ఎవరైనా మృతిచెందితే ఎల్లారెడ్డిపేట మండలం నుంచి వైకుంఠరథాన్ని తీసుకొస్తున్నారు. మృతదేహాలను వైకుంఠరథంలో ఉంచి శ్మశానం వరకు తీసుకెళ్లే అవకాశం లేకపోవడంతో.. బాధిత కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి. ఇన్‌చార్జి ఎంపీవో శ్రీనివాస్ మాట్లాడుతూ.. వాహనం ఇంజన్ మరమ్మతులకు గురైందని, త్వరలోనే బాగు చేయిస్తామని పేర్కొన్నారు.



ఆరోగ్యకేంద్రానికి ప్రహరీ నిర్మించరూ..



ఆస్పత్రి ముందు ఉన్న ప్రైవేట్ వాహనాలు

- ఆస్పత్రిలోనే వాహనాల పార్కింగ్

కోనరావుపేట: మండలంలోని నిమ్మపల్లిలో ఆరోగ్య ఉపకేంద్ర భవనానికి ప్రహరీ లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నిమ్మపల్లి బస్టాండ్ ప్రాంతంలో కొన్నేళ్ల క్రితం ఆరోగ్య ఉపకేంద్రానికి సొంత భవనాన్ని నిర్మించారు. కాగా ప్రహరీ నిర్మించకపోవడంతో వాహనాలకు అడ్డాగా మారింది. ఆరోగ్య ఉపకేంద్రానికి రోజూ సుమారు 40–50 మంది రోగులు ఆస్పత్రికి వివిధ రకాల చికిత్సల కోసం వస్తుంటారు. ప్రతి బుధవారం చిన్నారులకు వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహిస్తుంటారు. గ్రామానికి చెందిన కొందరు ట్రాక్టర్లు, కార్లు, ఇతర వాహనాలు ఆస్పత్రి ఆవరణలో నిలిపి ఉంచడంతో ఆస్పత్రికి వచ్చే వారు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై స్థానిక ఏఎన్ఎం సరోజ పలుమార్లు గ్రామపంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారినుంచి స్పందన కరువైంది. ఇప్పటికైనా అధి కారులు స్పందించి ఆస్పత్రికి వచ్చేవారికి ఇ బ్బందులు కలుగకుండా చూడాలని కోరుతున్నారు.

కేంద్రమంత్రికి సన్మానం



కేంద్ర మంత్రి సంజయ్‌ను గజమాలతో సన్మానిస్తున్న పర్శరాం

బోయినపల్లి: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి ఎడపల్లి పర్శరాం ఆధ్వర్యంలో పలువురు కార్యకర్తలు గురువారం గజమాలతో సత్కరించారు. అనంతరం ఆయనకు ఆధునిక మహాభారతం పుస్తకం బహుమతిగా అందించారు. మండల అభివృద్ధికి చేయూతనివ్వాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట నాయకులు అమిరిశెట్టి గంగయ్య, వినయ్, ప్రసాద్, శ్రీనివాస్ తదితరులున్నారు.

శ్రీవాణి పాఠశాలకు నోటీసులు

ముస్తాబాద్: మండలకేంద్రంలోని శ్రీవాణి స్కూల్‌కు నోటీసులు జారీచేసినట్లు ఇన్‌చార్జి ఎంఈవో బన్నాజీ గురువారం తెలిపారు. గతేడాది ఓపెనింగ్ అనుమతులు మాత్రమే పొందారని, ఇప్పటివరకు ప్రభుత్వ గుర్తింపును పొందలేదని పేర్కొన్నారు. రెండ్రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు. కాగా ఎలాంటి అనుమతులు లేకుండా స్కూల్ నిర్వహిస్తే అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదో చెప్పాలని ట్రస్మా మండల అధ్యక్షుడు పెద్దిగారి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శ్రీవాణి స్కూల్‌కు ప్రభుత్వ రికగ్నిషన్ ఇప్పటివరకు లేదన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి



రాజేశం(ఫైల్)

కోనరావుపేట: మండలంలోని వట్టిమల్ల గ్రామానికి చెందిన అనుముల రాజేశం (40) గుండెపోటుతో మృతిచెందాడు. గ్రామానికి చెందిన రాజేశం లారీడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం విధులనుంచి వచ్చిన రాజేశం రాత్రి గుండెపోటుతో మృతిచెందాడు. మృతుడికి భార్య సరళ, కుమారుడు పవన్ (14), కూతురు వర్షిణి (8) ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

వ్యక్తిపై దాడి.. పోలీసులకు ఫిర్యాదు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని పదిరకు చెందిన కుంభాల లక్ష్మారెడ్డిపై గురువారం దాడిచేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని బాధితుడి భార్య రేణుక పోలీసులకు ఫిర్యాదు చేసింది. లక్ష్మారెడ్డి అతని సోదరుడు సత్యంరెడ్డి మధ్య ఇంటి పంచాయతీ ఉందని, రూ.10వేలు అడిగితే మధ్యవర్తి మల్లారెడ్డి తన భర్త లక్ష్మారెడ్డిని పట్టుకోగా సత్యంరెడ్డి కర్రలతో దాడిచేశాడని పేర్కొంది. ఈ దాడిలో భర్త లక్ష్మారెడ్డి గాయపడ్డాడని, 108 వాహనంలో ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. దాడికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసింది.

మైనర్లకు వాహనాలు ఇస్తే క్రిమినల్ కేసులు



మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్‌గౌడ్

ఎల్లారెడ్డిపేట: తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సీఐ శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. మండలంలోని అక్కపల్లిలో గురువారం రాత్రి పోలీస్ కమ్యూనిటీ మీటింగ్ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ.. అపరిచిత వ్యక్తులు గ్రామాల్లోకి వస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. నంబర్ ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేస్తామన్నారు. ఎస్సై రమాకాంత్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



తంగళ్లపల్లిలో విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ మానస



ముస్తాబాద్‌లో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న వైద్యాధికారి గీతాంజలి



రుద్రంగిలో మాత్రలు వేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

తంగళ్లపల్లి: విద్యార్థులు చదువుతోపాటుగా ఆరోగ్యంపై కూడా శ్రద్ధ చూపాలని ఎంపీపీ పడిగెల మానస రాజు అన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం పంపిణీ చేసే నులిపురుగుల నివారణ మాత్రలను వేసుకోవాలన్నారు. ఇల్లంతకుంట మండలకేంద్రంలో ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్య మాత్రలు పంపిణీ ప్రారంభించారు. అడిషన్ డీఎంహెచ్‌వో రజిత, ఇల్లంతకుంట ఎంపీడీవో శ్రీనివాస మూర్తి, మెడికల్ ఆఫీసర్ స్నేహ, విద్యార్థులు పాల్గొన్నారు.
వేములవాడఅర్బన్: వేములవాడ మండలం సంకెపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు బుర్ర లహరిక శేఖర్ విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.
రుద్రంగి: నులిపురుగు నివారణతోనే పిల్లలు ఆరోగ్యవంతులుగా ఉంటారని రుద్రంగి ఎంపీపీ గంగం స్వరూపారాణి, జెడ్పీటీసీ గట్ల మీనయ్య అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో అధ్యాపకులు, వైద్య సిబ్బందితో కలిసి విద్యార్థులకు నులి పురుగు నివారణ మాత్రలు వేశారు. వైద్యసిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.
కోనరావుపేట: చిన్నారులకు ఆరోగ్యకరమైన అలవాట్లు నేర్పించాలని ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్య అ న్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండలకేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో మాత్రలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిన్నారులు చేతులను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎంపీటీసీ నర్సింహచారి, ప్రిన్సిపాల్ సాగర్ పాల్గొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లోని పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు.
ఎల్లారెడ్డిపేట: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రలు పంపిణీ చేశారు. చిన్నారులకు అల్బెండజోల్ మాత్రలు వేయించాలని సూచించారు.
ముస్తాబాద్: చిన్నారులు నులి పురుగు నివార మాత్రలు వేసుకోవాలని వైద్యాధికారి గీతాంజలి కోరారు. మండలంలో విద్యార్థులకు నులి పురుగు నివారణ మాత్రలు పంపిణీ చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలతోపాటు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మాత్రలు పంపిణీ చేసినట్లు తెలిపారు. హెచ్ఈవో యాదగిరి, సూపర్‌వైజర్లు ఏఎన్ఎంలు, పాల్గొన్నారు.
గంభీరావుపేట: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రలు (అల్బెండజోల్) పంపిణీ చేశారు. గోరింటాల పాఠశాలలో జెడ్పీటీసీ విజయ చేతులమీదుగా చిన్నారులకు మాత్రలు వేశారు.
బోయినపల్లి: మండలకేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఎంపీపీ వేణుగోపాల్ మాత్రలు పంపిణీ చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి రేణుక, హెడ్‌మాస్టర్ భూమయ్య, తదితరులు పాల్గొన్నారు.
వీర్నపల్లి: మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు అరుణ్‌కుమార్ విద్యార్థులకు నులి పురుగు నివారణ మాత్రలు వేశారు. ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఏబీవీపీ నాయకుల ఫిర్యాదు



కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు ఫిర్యాదు చేస్తున్న ఏబీవీపీ నేతలు

సిరిసిల్లటౌన్: జిల్లాలో కార్పొరేట్లకు విద్యాశాఖ అధికారులు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్‌కుమార్ ఆరోపించారు. జిల్లాలో పలు కార్పొరేట్ పాఠశాలలు నిబంధనలు అతిక్రమిస్తున్నా అధికారులు మిన్నకుంటున్నారంటూ గురువారం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు ఫిర్యాదు చేశారు. 2009లో అమలుచేసిన జీవో నంబర్ 91 ప్రకారం కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు టెక్నో, ఈటెక్నో, డీజీ, టాలెంట్, ఒలింపియాడ్ తదితర బ్రాండ్ పేరుతో పాఠశాలలు నడపొద్దని, పాఠశాలల్లో పుస్తకాలు అమ్మొద్దని పేర్కొన్నారు. జిల్లాలో చాలా విద్యాసంస్థల్లో నిబంధనలు, ప్రభుత్వ జీవోలకు విరుద్ధంగా నడుస్తున్నాయన్నారు. ఫీజుల నియంత్రణ పూర్తిగా కరువైందని, పేద విద్యార్థుల నుంచి బలవంతంగా వసూళ్లు చేస్తున్నా విద్యాశాఖ పట్టింపు లేకుండా ఉంటోందన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో జరుగుతున్న అక్రమాలను కట్టడి చేయాలని, అందుకు సహకరిస్తున్న జిల్లా విద్యాధికారితో పాటు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు శామనపల్లి ప్రశాంత్, లోపెల్లి రాజు, ఎలగందుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

24న బ్యాంక్ ఉద్యోగాల భర్తీకి జాబ్‌మేళా

సిరిసిల్లకల్చరల్: కార్పొరేట్ బ్యాంకింగ్ రంగసంస్థ ఐసీఐసీఐ పలు శాఖల్లోని ఖాళీ పోస్టుల భర్తీకి ఈ నెల 24న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధి సతీశ్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. కస్టమర్ రిలేషన్‌షిప్ మేనేజర్ హోదాగల ఆన్‌రోల్ ఉద్యోగాలను ఈమేళాద్వారా భర్తీ చేస్తామని పేర్కొన్నారు. 18 నుంచి 25ఏళ్ల వయసు గలవారు అర్హులన్నారు. డిగ్రీ ఫైనలియర్ పరీక్షలు రాసినవారు సైతం మేళాకు హాజరుకావచ్చన్నారు. మహతి మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం ఉదయం 9గంటలకు మేళా ప్రారంభమవుతుందని తెలిపారు. పూర్తివివరాలకు 6301578379లో సంప్రదించాలని సూచించారు.

నిధులు మంజూరు చేయాలని వినతి



ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇస్తున్న మాజీ సర్పంచ్, తదితరులు

కోనరావుపేట: మండల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ మాజీ సర్పంచ్ పోకల రేఖ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోనరావుపేట బస్టాండ్ ప్రాంతం నుంచి పశువుల ఆస్పత్రి వరకు ఉన్న రోడ్డుపై రవాణా ఎక్కువగా ఉందన్నారు. వాహనాల రద్దీ పెరగడంతో పాటు మురుగునీరు రోడ్డుపై పారుతోందన్నారు. ఈ రోడ్డును 40 ఫీట్లు వెడల్పుగా విస్తరించేందుకు గతంలోనే తీర్మానించినట్లు తెలిపారు. ఈరోడ్డు విస్తరణ, సీసీరోడ్డు, మురుగు కాల్వల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఆమె వెంట సంతోష్, తదితరులున్నారు.

దంపతులకు తీవ్ర గాయాలు

- గుర్తు తెలియని వాహనం ఢీ

ఎల్లారెడ్డిపేట: మండలంలోని పదిరకు చెందిన దేవరాజు తన భార్య, కూతురుతో కలిసి గురువారం బైక్‌పై ఎల్లారెడ్డిపేటకు వెళ్తుండగా..గుర్తు తెలియని బైక్ ఢీకొట్టింది. ఈ సంఘటనలో దేవరాజు, అతని భార్య, కూతురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. అయితే ఎల్లారెడ్డిపేట నుంచి సిరిసిల్ల వైపునకు అత్యంత వేగంగా బైక్‌పై వెళ్లిన గుర్తు తెలియని యువకుడు దేవరాజు బైక్‌ను ఢీకొట్టి పరారీ అయ్యాడు. సదరు యువకుడు మద్యం మత్తులో ఉన్నట్లు స్థానికులు తెలిపారు. పోలీసులు విచారణ చేస్తున్నారు.



గాయపడ్డ దేవరాజు